www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
మంగళవారం | 14 | జూలై | 2026 | పేజీలు: 08









# దేవాదుల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి

## దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కొరత ఉండదు

- 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపుతాం
- 38.16 టీఎంసీల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తాం
- భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- గోదావరి జలాలతో రైతాంగానికి పూర్తి భరోసా

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి భట్టి విక్రమార్క

**ములుగు, అక్షిత ప్రతినిధి :** దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా అన్ని పనులను యుద్ధ ప్రాతి పదికన పూర్తి చేసి, పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగిస్తామని, 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపి దేవాదుల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు రైతులకు గోదావరి జలాలతో శాశ్వత భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భూసేకరణను వేగవంతంగా పూర్తి చేసి, ప్రాజెక్టు ..మిగతా 2లో

## ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు

- మూడు దశల్లో కంటింజెన్సీ ప్లాన్ అమలు
- రైతులకు ముందస్తు అవగాహన, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి
- పటాన్‌చెరులోని ఇక్రిశాట్‌లో రాష్ట్రస్థాయి సమీక్ష
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**సంగారెడ్డి, అక్షిత బ్యూరో :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని..మిగతా 2లో



## రీ సర్వేలో తప్పులకు తావివ్వొద్దు

### పారదర్శకంగా భూ రీ సర్వే : కలెక్టర్ చంద్ర శేఖర్

**నల్గొండ, అక్షిత ప్రతినిధి:** ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా భూముల రీ సర్వేను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సర్వేయర్లను ఆదేశించారు. సోమవారం ఎన్జీ కళాశాల లో భూముల రీ సర్వే విషయమై సర్వేయర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వేయర్లు సర్వే నిర్వహించే సమయంలో గతంలోని సర్వే రికార్డులను ఆధారం చేసుకుని సర్వే నిర్వహించాలని, సర్వే నంబర్ ట్యాలీ చేసుకుని నిర్ధారణకు వచ్చిన తర్వాత సర్వే చేయాలన్నారు. టీపన్ మ్యాప్ కూడా సర్వే సమయంలో దగ్గర ఉంచుకోవాలని, సర్వేలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు .సర్వేలో తప్పిదాలు జరిగితే కోర్టు కేసులు నమోదయ్యే ఆస్కారం ..మిగతా 2లో

## "ప్రతిభ"కు సీటేది!

- అత్యుత్తమ మార్కులొచ్చిన అందని సీటు
- 505 మార్కులు సాధించినా గిరిజన విద్యార్థినికి గురుకులంలో ప్రవేశం నిరాకరణ
- న్యాయం కోసం కలెక్టర్ గడపకు శరణ్య



**భద్రాద్రి కొత్తగూడెం/ అక్షిత ప్రతినిధి:** ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన విద్యా వ్యవస్థే... ఒక గిరిజన విద్యార్థిని జీవితాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. పదో తరగతిలో 505 మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్న ఓ నిరుపేద గిరి జన బాలికకు, శారీరక వైకల్యమే అడ్డుగోడగా ..మిగతా 2లో

## ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలు

**మొదటి పేజీ తరువాయి...**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం పటాన్‌చెరులోని ఇక్రిశాట్ లో రాష్ట్రస్థాయి వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, వాతావరణ తదితర అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్రంలో ఎల్‌నినో నేపథ్యంలో కంటింజెన్సీ ప్లానింగ్ పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలోని ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, వర్షాలు ఆలస్యం అయ్యే అవకాశాలు, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం, భూగర్భ జలాల లభ్యత, ఖరీఫ్ పంటలపై ప్రభావం, రైతులకు అందించాల్సిన సాంకేతిక సూచనలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ చర్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రామాణికంగా తీసుకుని మూడు దశల్లో కంటింజెన్సీ ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. వర్షపాత పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ ప్రతి జిల్లాకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ముందస్తుగా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాలుగా మారిన నేపథ్యంలో శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అనుసరించాలని తెలిపారు.వర్షాలు ఆలస్యమైనా లేదా తక్కువగా కురిసినా రైతులు ఇబ్బందులు పడకుండా వరికి బదులుగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, వేరుశనగ, పెసలు, మినుములు, కందులు, సజ్జలు, జొన్నలు వంటి తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. అలాగే తక్కువ కాల వ్యవధిలో దిగుబడి ఇచ్చే స్వల్పకాలిక విత్తనాలను అందుబాటులో ఉంచి రైతులకు అవసరమైన విత్తనాల సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో వర్షపాతం, నీటి లభ్యత ఆధారంగా ఏ పంటలు సాగు చేయాలో రైతులకు స్పష్టమైన సూచనలు అందించాలని, వాతావరణ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖల నుంచి రోజువారీ సమాచారం సేకరించి రైతులకు చేరవేయాలని మంత్రి తెలిపారు. వాతావరణ సమాచారం, వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల స్థితి వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించి రైతులు ముందస్తు నిర్ణయాలు తీసుకునేలా చూడాలని సూచించారు. వ్యవసాయ శాఖ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న కంటింజెన్సీ ప్లాన్‌ను వెంటనే విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి కే.సురేంద్రమోహన్, ఉద్యాన, సెరికల్చర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష, స్పెషల్ కమిషనర్, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ రాహుల్ రాజ్, వ్యవసాయ ఒ పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ బి. గోపి, టీజీఎస్‌డబ్ల్యూసీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. లక్ష్మి, టీజీఎస్పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, హాకా మేనేజింగ్ డైరెక్టర్ కె. చంద్రశేఖర్, భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం, ఐసీఏఆర్, ఐఐఓఆర్, ఐఐఎంఆర్, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, అలాగే వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, భూగర్భ జలాలు, నీటిపారుదల, విద్యుత్ తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రీ సర్వేలో తప్పులకు తావివ్వొద్దు

**మొదటి పేజీ తరువాయి...**



ఉంటుందని, అందువల్ల పూర్తి అత్యంత అప్రమత్తంగా ఉంటూ సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక గ్రామంలో సర్వే నిర్వహించే సమయంలో ప్రభుత్వ భూములు, పట్టా భూములు, ప్రాజెక్టుల కింద ఉన్న భూములు, అలాగే గ్రామకంఠం, గ్రామపంచాయతీ , మున్సిపల్ భూములు అన్నింటిని దృష్టిలో ఉంచుకొని సర్వే నిర్వహించాలన్నారు. సర్వేలో చైన్ మరియు రోవర్ లను ఉపయోగించాలని, చట్టం ప్రకారమే నియమ నిబంధనలను అతిక్రమించకుండా సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# దేవాదుల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి

**మొదటి పేజీ తరువాయి...**

పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించడం తో పాటు పెండింగ్ బిల్లులను ఇప్పటికే విడుదల చేశామని, సాగునీరు--తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని, ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే ఎదుర్కొనే కార్యాచరణను కూడా అమలు చేస్తున్నామని లిరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్కలి తెలిపారు.

సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గార్లకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి.ఓ. లెనిన్ వస్సల్ టోప్పో, డి ఎఫ్ ఓ వికాస్ మినాలు పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి తుపాకులగూడెం సమ్మక్క సారలమ్మ బ్యారేజీ గోదావరి నది నీటి ప్రవాహాన్ని నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించి, తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టల గంగారం జె చొక్కా రావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్ ను, మోటార్ల పనితీరును, ఎత్తిపోతల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు.



అనంతరం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో దేవాదుల ప్రాజెక్ట్ పెండింగ్ పనులు, భూ సేకరణ, ఎత్తిపోతల సామర్థ్యం, సాగు త్రాగునీరు, మోటార్ల పనితీరు పై పి పి టి ద్వారా ఇంజనీరింగ్ అధికారులు వివరించగా ఇట్టి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ: ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు, తాగునీటి అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం దూరదృష్టితో కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం తో కలిసి పలు మార్లు విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎలా ఉండబోతోందో, దాని వల్ల వ్యవసాయం, తాగునీటి సరఫరా, జలవనరులపై కలిగే ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై లోతుగా చర్చించి ముందస్తు కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.

**రూ.194 కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ఇస్తుందని, ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించి రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**దేవాదుల పూర్తి చేయడమే ప్రభుత్వ సంకల్పం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఇంజనీరింగ్ అధికారులు,

ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# "ప్రతిభ"కు సీటేది!

**మొదటి పేజీ తరువాయి...**

మారింది. చిన్ననాటి ప్రమాదంలో ఒక చేతి పనిచేయకుండా పోయినా ఆత్మవిశ్వాసంతో చదువును కొనసాగించిన విద్యార్థినిని, ఉన్నత విద్య కోసం చేరిన గురుకుల కళాశాలలో అధికారులు అవమానించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కారం విద్యా శరణ్య అనే విద్యార్థిని ప్రస్తుతం న్యాయం కోసం జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది.

**పేదరికం మధ్య వెలిగిన ప్రతిభ**

శరణ్య కుటుంబం అత్యంత నిరుపేద గిరిజన కుటుంబం. రోజువారీ కూలి పనులతో జీవించే తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివించాలని కలలు కన్నారు.ఆ ఆశయాన్ని నిజం చేస్తూ శరణ్య చిన్నప్పటి నుంచే ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకుంది.అయితే ఎనిమిదేళ్ల వయసులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె ఎడమ చేయి పూర్తిగా పనిచేయకుండా పోయింది. మెరుగైన వైద్యం చేయించే ఆర్థిక స్తోమత లేకపోయినా, ఆ వైకల్యాన్ని జయించి చదువులో రాణించింది. పదో తరగతిలో 505 మార్కులు సాధించి తన ప్రతిభను నిరూపించింది.

**ఆశతో వెళ్లి... అవమానంతో తిరిగి**

ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన శరణ్యకు ఖమ్మం జిల్లా వైరా గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో సీటు లభించింది. కుటుంబ



సభ్యులతో కలిసి చేరేందుకు వెళ్లిన ఆమెకు అక్కడ ఊహించని పరిస్థితి ఎదురైంది.విద్యార్థిని వికలాంగురాలనే కారణంతో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవేశం నిరాకరించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సర్టిఫికెట్లు తిరిగి ఇచ్చి, హాస్టల్‌లో ఉండలేరంటూ పంపించివేశారని వారు వాపోతున్నారు.

**ఆర్సీఓ వద్దా నిరాశే...!**

ఈ విషయాన్ని భద్రాచలం రీజనల్ కో-ఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లినా తమకు న్యాయం జరగలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తమతో చులకనగా మాట్లాడారని, సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో చదువుకున్న విద్యార్థిని, ఇంటర్మీడియట్‌లో మాత్రం హాస్టల్‌లో ఉండలేదని చెప్పడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పుడు ఆశ అంతా కలెక్టర్‌పైనే...**

న్యాయం కోసం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయానికి వెళ్లినా ఆయన అందుబాటులో లేకపోవడంతో నిరాశే ఎదురైంది. దీంతో సోమవారం జరిగే జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసి న్యాయం కోరాలని శరణ్య కుటుంబం నిర్ణయించింది.

**ప్రశ్నలు లేవనెత్తుతున్న ఘటన**

ఈ ఘటన పలు కీలక ప్రశ్నలను ముందుకు తెస్తోంది. ప్రతిభ కంటే వైకల్యానికే ప్రాధాన్యం ఇస్తున్నారా? ప్రభుత్వ గురుకులాల్లో వికలాంగ విద్యార్థులకు ప్రవేశం కల్పించే నిబంధనలు అమలు కావడం లేదా? ఒక చేతి పనిచేయకపోతే ఉన్నత విద్య చదివే హక్కు ఉండదా?

**వికలాంగుల హక్కుల చట్టం అమలు ఎక్కడ?**

**తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**

గిరిజన, విద్యార్థి సంఘాలు ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బాధ్యులపై శాఖాపరమైన విచారణ జరిపి, విద్యా శరణ్యకు వెంటనే వైరా గురుకులంలో ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. అలాగే ఆమె చదువుకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలని కోరుతున్నాయి.

**న్యాయం జరుగుతుందా...?**

ఒక వైపు "సమాన విద్యా అవకాశాలు", "అందరికీ విద్య" అని ప్రభుత్వాలు ప్రచారం చేస్తుంటే... మరోవైపు ప్రతిభావంతురాలైన గిరిజన విద్యార్థిని వైకల్యం పేరుతో వెనక్కి పంపించారన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో శరణ్యకు న్యాయం జరుగుతుందా? లేక మరో ఫైల్‌గా మిగిలిపోతుందా? అన్నది ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# చారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

# వైద్య సేవల పరిశీలన



### అంగన్వాడీలో నులిపురుగుల నివారణ కార్యక్రమం

### పోషకాహార పంపిణీపై కలెక్టర్ ఆరా

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** రోగులకు నాణ్యమైన వైద్యం, చిన్నారులకు మెరుగైన పోషకాహారం అందించాలి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సోమవారం చారకొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు చికిత్స, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మొదట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. వైద్యులు విధుల్లో సమయానికి హాజరవుతున్నారా, రోగులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా, అవసరమైన మందులు, అత్యవసర వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై వైద్యాధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.



రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేసిన కలెక్టర్, ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కూడా సూచించారు.

అనంతరం సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మాత్రలు పంపిణీ జరుగుతున్నాయా అనే అంశాన్ని తెలుసుకున్నారు. ఏ వయస్సు పిల్లలకు ఎంత మోతాదులో మాత్రలు ఇస్తున్నారో అడిగి వివరాలు సేకరించారు.

ఈ సందర్భంగా ఒకటి నుంచి రెండు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు అర మాత్ర, రెండు నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఒక్క మాత్ర చొప్పున అందజేస్తున్నట్లు ఏఎన్ఎంలు కలెక్టర్‌కు వివరించారు. ఈ విధానాన్ని ప్రశంసించిన కలెక్టర్, అర్హులైన ప్రతి చిన్నారికి తప్పనిసరిగా మాత్రలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

మాత్రలు పంపిణీ చేసిన అనంతరం చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఏవైనా అసౌకర్యాలు తలెత్తితే వెంటనే వైద్య సహాయం అందించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు ఆదేశించారు. మాత్రల పంపిణీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులతో కలెక్టర్ కొంతసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. తన మొబైల్ ఫోన్‌లో డైనోసార్ చిత్రాలను చూపిస్తూ చిన్నారులను ఆనందపరిచారు. పిల్లలతో మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యం, నేర్చుకునే ఆసక్తిని గమనించారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా బోధన అందిస్తూ వారి మానసిక వికాసానికి దోహదపడేలా అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, గుడ్ల పంపిణీ, పాలు, ఇతర పోషకాహార పదార్థాల సరఫరా, వాటి నాణ్యత, పంపిణీ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్నారికి ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, సరఫరాలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్, భద్రత వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని సూచించారు.

చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి లబ్ధిదారునికి పూర్తిస్థాయిలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్త ఉన్నారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలి

### వినతి పత్రం అందజేసిన టి జె ఏ జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా

**యాదాద్రి భువనగిరి /అక్షిత బ్యూరో:** యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలని సోమవారం రోజున జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ని కలిసి వినతి పత్రం అందజేసిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ షానూర్ బాబా వారు వర్కింగ్ జర్నలిస్ట్ ల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరిస్తానని సానుకూలంగా స్పందించారు. వారితోపాటు టీ జె ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపురాజు వెంకన్న జిల్లా ఉపాధ్యక్షులు మొహమ్మద్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



## తానూర్ మండలంలో విషాదం..

### సర్పంచ్ పల్లె జ్యోతి ఆత్మహత్య

### బోరిగావ్ గ్రామంలో కలకలం.. ఘటనపై పోలీసులు దర్యాప్తు



**నిర్మల్ అక్షిత బ్యూరో :** నిర్మల్ జిల్లా తానూర్ మండలం బోరిగావ్ గ్రామంలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి సోమవారం తన నివాసంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సర్పంచ్ ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గ్రామ సర్పంచ్ ఆకస్మిక మరణంతో బోరిగావ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత పాటించాలి: ఎస్సై వెంకన్న



**మహబూబాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశాల మేరకు నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లి గ్రామంలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బానోతు వెంకన్న ద్విచక్ర వాహనదారులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి, హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని సూచించారు. గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమని పేర్కొంటూ, గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలు సహకరించి వ్యసన రహిత గ్రామ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌చే విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ




**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** అంతర్జాతీయ లైన్స్ క్లబ్ సమావేశంలో నల్లగొండ జిల్లా నూతన గవర్నర్ గా కే .వి ప్రసాద్ ,హాంకాంగ్ లో ప్రమాణస్వీకారం చేసి స్వదేశానికి విచ్చేసిన సందర్భంగా లైన్స్ క్లబ్ చౌటుప్పల సేవ వారు నూతన గవర్నర్ కు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంకిరెడ్డిగూడెం గ్రామ పరిధిలోని మైనార్టీ ప్రభుత్వ పాఠశాలలోనీ విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదిగా నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, సమాజ సేవతో పాటు విద్య సేవకు, లైన్స్ క్లబ్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జిల్లా నాయకులు తీగల మోహన్ రావు, బాచుపల్లి రవీందర్రావు, దాచేపల్లి ప్రకాష్, ఉప్పు ఆంజనేయులు, అతహర్ పాషా, దాచేపల్లి రాజు, బత్తిని రఘు, గోశిక కరుణాకర్, కామిశెట్టి భాస్కర్, కాసుల వెంకటేశం, కటకం ప్రశాంత్, కొసనం రామ్ రెడ్డి, కామిశెట్టి చంద్రశేఖర్, దాచేపల్లి శ్రీను, తిరందాసు జగన్నాథ్, సిలివేరు మంగయ్య, చింతల ప్రభాకర్ రెడ్డి, వేముల నరసింహ, సరోజ సత్యనారాయణ, పోలోజు శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

# జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

**టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ భవేశ్ మిశ్రాకు వినతి**

**అర్హులైన వారికి అక్రిడేషన్, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్**



**లోకేశ్వరం, జూలై 13 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్ డిమాండ్ చేశారు. సోమవారం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవిదాస్ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు ఇళ్ల స్థలాల విషయంలో చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పేద జర్నలిస్టులను గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు గృహ నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకపోతే యూనియన్ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జావిద్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు...

# అంతర్జాతీయ తెలుగు రచయిత్రల మహాసభలలో జాతీయ పురస్కారం అందుకున్న ప్రముఖ కవి రచయిత డాక్టర్ బుక్కా



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ప్రముఖ కవి రచయిత నంది అవార్డు గ్రహీత డాక్టర్ బుక్కా సత్యనారాయణకు 2026 జూలై 11, 12 శని ఆదివారాలలో యుద్ధనపూడి సులోచనారాణి సభా ప్రాంగణం కేబీఎన్ కళాశాల విజయవాడ ఆవరణలో జరిగిన మూడవ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలలో రెండవ సభాస్థలి సమన్వయకర్తగా కార్యనిర్వాహక కమిటీలో ప్రధాన బాధ్యత తీసుకొని కవి సమ్మేళనాలు చక్కగా జరిపినందుకుగాను వీరికి తెలుగు సాహిత్య సేవలో నిరంతర అంకితభావంతో తదేక దీక్షతో కృషి చేస్తున్న సాహితీ తపస్వి డాక్టర్ బుక్కా సత్యనారాయణకు ఉన్న కార్యదీక్షను సృజనాత్మక నాయకత్వాన్ని హృదయపూర్వకంగా ప్రశంసిస్తూ ఈ ప్రశంసా పత్రాన్ని సగర్వంగా సమున్నతంగా జాతీయ పురస్కారాన్ని ఈ మహాసభల ప్రధాన కార్యనిర్వాక సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గుత్తికొండ సుబ్బారావు డాక్టర్ జి వి పూర్ణచందు చేతుల మీదుగా జాతీయ పురస్కారాన్ని ఘనంగా సత్కరించి ముగింపు సభలో అందజేశారు.

ఈ పురస్కారాన్ని అందుకున్నందుకు గాను తెలుగు రాష్ట్రాల కవులు రచయితలు ఖమ్మం ప్రజాసంఘాల నాయకులు మహిళా సంఘం నాయకురాలు ఈ పురస్కారం పొందినందు కు గాను సత్యనారాయణ ను అభినందిస్తూ ఇంకా వీరు సాహిత్య సేవలో మంచి కార్యక్రమాలు చేపడుతూ ఇంకా ఎన్నో పురస్కారాలు తీసుకోవాలని వారిని అభినందించారు.

# విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదు

**దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జూలై 15న కొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవం**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. జూలై 15న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తకోట పట్టణంలో పర్యటించి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రూ. 1.77 కోట్ల సీఎస్ఆర్ నిధులు, దాతల సహకారంతో కొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, రూ. 33. 50 లక్షల వ్యయంతో పీఎం శ్రీ కింద లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ నూతన భవనాల నిర్మాణాన్ని పూర్తిచేసి, జూలై 15న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గతంలో ఈ పాఠశాలలో బాలికలు తగిన సౌకర్యాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ చదువుకున్నారని, ప్రస్తుతం ఆధునిక వసతులతో కూడిన భవనం అందుబాటులోకి రావడం విద్యార్థినులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి నియోజకవర్గంలో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్"లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికల్లా ఈ పాఠశాలలు పూర్తై సుమారు 2,500 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ ప్యానెల్ బోర్డులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. జూలై 15న ముఖ్యమంత్రి ముందుగా మహబూబ్‌నగర్‌లోని అమరరాజా సంస్థ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం మధ్యాహ్నం కొత్తకోటకు చేరుకుని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించి, ప్రభుత్వ విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలు, భవిష్యత్ కార్యాచరణపై వారితో మాట్లాడనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నందున రాజకీయ ప్రసంగాలకు తావు లేకుండా విద్యా అంశాలకే ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరగడంతో గత ఏడాదితో పోలిస్తే విద్యార్థుల ప్రవేశాలు కూడా గణనీయంగా పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏఎస్పీ వీరారెడ్డి, జెడ్పి సీఈవో యాదయ్య, ఎమ్ ఈ ఓ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ సైదయ్య, తహసీల్దార్ సుభాష్, ఎంపీడీఓ వినీత్, జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంపు చేస్తే బ్యారేజీలు ఎందుకు..?

**కేటీఆర్ హరీష్ రావులకు మంత్రి వివేక్ సూటి ప్రశ్న**

**కెసిఆర్ అసెంబ్లీకి రావాలని సూచన**



**రాజన్నసిరిసిల్ల అక్షిత బ్యూరో:** కన్నెపల్లి పంప్ హౌస్ నుండి గోదావరి నీళ్లను పంపు చేయాలని కేటీఆర్ హరీష్ రావులు గగ్గోలు పెట్టడం వారి అవివేకానికి నిదర్శనమని మంత్రి గడ్డం వివేక్ అన్నారు. సోమవారం సిరిసిల్లలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టణ శివారులో స్వాగతం పలికిన సిరిసిల్ల కాంగ్రెస్ నేతలు.చాలా రోజుల తర్వాత కేసీఆర్ ఫామ్ హౌస్ నుండి మనుమడి కోసం బయటకు వచ్చారన్నారు. మా సీఎం రేవంత్ రెడ్డి చాలా సార్లు ప్రజా సమస్యల పై మాట్లాడాలని కోరాగా ప్రతి పక్ష లీడర్ గా కేసీఆర్ ఏనాడు ఒక్క మాట మాట్లాడలేదన్నారు. కేటీఆర్, హరీష్ ఇద్దరు కన్నెపల్లి పంపు హౌస్ నుండి వాటర్ ని పంపు చేయాలని అంటున్నారు పంపు చేయగలిగితే బ్యారేజ్ లు ఎందుకు కట్టారనీ టిఆర్ఎస్ లో ప్రశ్నించారు. కెసిఆర్ ఇంజనీర్ కాదనీ, సెంట్రల్ కమిటీ రిపోర్ట్ ప్రకారమే బ్యారేజీలు నింపడం లేదన్నారు. కేటీఆర్, హరీష్ రావు రోజు పబ్లిసిటీ కోసం పాకులాడుతున్నారనీ ఎద్దేవా చేశారు. కవిత అడిగిన రూ.1400 కోట్లు ఎక్కడి నుండి వచ్చాయన్న దానికి వారు ప్రజలకు సమాధానం చెప్పాలనీ సూచించారు. కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు, కమీషన్ ల పరిపాలన జరిగిందన్నారు ఎలినేనో ప్రభావం తో వర్షాలు పడడం లేదనీ, రైతులకు ఏమి చేద్దామను ముందుకు రావాలని సూచించారు. సిరిసిల్లలో ఇందిరమ్మ పథకం ద్వారా కేటాయించిన 3500 ఇళ్లలో 2500 ఇళ్లు కట్టడం జరిగిందన్నారు

బి ఆర్ ఎస్ హాయంలో ఓట్ల కోసం డబుల్ బెడ్ రూమ్ లు ఇస్తామని కాలం వెళ్ల దీశారనీ విమర్శించారు.ఆనాటి నుంచి ఈనాటి వరకు పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. ఐటీఐ ట్రైనింగ్ ఉన్నవారికి జర్మనీ టామ్ టామ్ సంస్థ ద్వారా , సిరిసిల్ల నుండి 100 మంది వరకు ఉద్యోగాలు కల్పిద్దామణిఅని మంత్రి వివేక్ చెప్పారు.

# రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు

**ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** రోడ్లపై కేజ్ వీల్స్ అమర్చిన ట్రాక్టర్లను నడపడం చట్టరీత్యా నేరమని నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ప్రజల కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి గ్రామాల వరకు మెరుగైన రహదారులను నిర్మిస్తోందని కాబట్టి వాటిని సురక్షితంగా ఉంచడం రోడ్డు దెబ్బతినకుండా చూసుకోవడం అందరి బాధ్యతని అన్నారు.

వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ అమర్చడం సాధారణమే అయినప్పటికీ పొలాల వద్ద పనులు ముగిసిన తర్వాత కేజ్ వీల్స్ తొలగించిసాధారణ టైర్లు వేసుకోవాలి. లేదా రోడ్లకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయాలు వాడాలన్నారు.

వ్యవసాయ పనులకు ఉపయగించే కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామ శివారులో కాకర్లపల్లి నుండి రుద్రాక్షపల్లి మధ్య గల ఆర్ అండ్ బి రోడ్డులో రోడ్లపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడుపుతున్నారని వాటితోనే రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్లకు యజమానులైన సారా కృష్ణ పమ్మి కృష్ణయ్య గుత్తి ముత్యాలరావు బోసి కొర్రాజులు పై సత్తుపల్లి పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేయడం జరిగిందన్నారు.ప్రజల ప్రాణాలు ఆస్తుల రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని రైతులు ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు. ఎవరైనాని బంధనలు ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించినా లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే డయల్ --100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా ట్రాక్టర్ డ్రైవర్లకు యజమానులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలాని పోలీస్ అధికారులకు ఆదేశించారు.

# నులిపురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యానికి భరోసా

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్**




**మహబూబ్ నగర్ ,అక్షిత ప్రతినిధి:** జిల్లా కేంద్రం భగీరథ కాలనీ లో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల 2లో సోమవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి తగ్గడం, కడుపునొప్పి, బరువు పెరగకపోవడం



వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. డీవార్మింగ్ కార్యక్రమం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు శారీరక, మానసిక వికాసానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఎ. శ్రీనివాసులు మాట్లాడుతూ, ఒకటి నుంచి రెండు సంవత్సరాల లోపు పిల్లలకు అర మాత్రను పొడిచేసి నీటిలో కలిపి ఇవ్వాలని, రెండు సంవత్సరాలు పైబడిన వారికి 400 మిల్లీగ్రాముల పూర్తి మాత్రను నమిలి మింగేలా ఇవ్వాలని తెలిపారు. ఖాళీ కడుపుతో మాత్రలు వేయకుండా, ఆహారం తీసుకున్న తర్వాత మాత్రమే ఇవ్వాలని సూచించారు.

పాఠశాలల్లో చదివే పిల్లలకు ఆయా విద్యాసంస్థల్లో, పాఠశాలలకు వెళ్లని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశా కార్యకర్తల ద్వారా ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పిల్లల గోర్లను ఎప్పటికప్పుడు కత్తిరించడం, పరిశుభ్రమైన నీటిని మాత్రమే తాగించడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి వినియోగించడం, బహిరంగ మలవిసర్జనకు బదులుగా మరుగుదొడ్లను వినియోగించడం వంటి పరిశుభ్రత అలవాట్లు నులిపురుగుల నివారణకు దోహదపడతాయని వైద్యాధికారులు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ఎన్. శైలజ, డా. బి. శంకర్, డా. రాజు, డా. పులి విద్య, డా. నరేష్ చంద్ర, డా. ప్రవీణ్, మెడికల్ కళాశాలకు చెందిన డా. బిందు, మహాలక్ష్మి, హన్మంతు, నాగరాజు శెట్టి, భాస్కరాచారి, సుభాష్, సీతారామ్, ఆరోగ్య శాఖ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తూరులో సిద్దాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా మహాధర్నా

**పోలీసులు నాయకుల మధ్య వాగ్వాదం**

**కొత్తూరు రోడ్డుపై పార్టీలకు అతీతంగా మండల నాయకులు, సిద్ధాపూర్ చుట్టుపక్కల గ్రామాల సర్పంచులు, యువకులు, డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతంగా చేశారు.. పార్టీలకు అతీతంగా వివిధ గ్రామాల సర్పంచ్లు ,పార్టీ నాయకులు ,మహిళలు యువకులు పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టి కొత్తూరు జాతీయ రహదారిపై బేటాయించి ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు మహా ధర్నా ఉద్యమాన్ని అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వల్ల జరిగే నష్టాలు చుట్టుపక్కల గ్రామాల వేల మంది రైతులకు నష్టం కలిగిస్తుందని ముఖ్యంగా గ్రామాలకు గిరిజన తండాలకు నష్టం జరుగుతుందని. తమ వేలాదిమంది బతుకులో చీకటి రాజ్యం చేయవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ మొండి వైఖరిని మార్చుకోకపోతే సకలజనుల సమ్మె ఉద్యమం ప్రభావం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీలకు అతీతంగా మండల అధ్యక్షులు సిద్దాపూర్ గ్రామ చుట్టుపక్కల సర్పంచులు మాజీ ఎంపిటిసిలు మహిళలు యువకులు భారీ ఎత్తున తరలించి మహా ధర్నా కార్యక్రమంలో తమ ఆవేదన వ్యక్తం చేశారు.

## మీసేవ నిర్వాహకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**గ్రీవెన్స్‌లో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు**



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** పెద్దాపూర్ మీసేవ కేంద్రం నిర్వాహకుడు అనిశెట్టి రాజు భూభారతి ల్యాండ్ రిజిస్ట్రేషన్ సేవల పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడమే కాకుండా, నకిలీ రసీదును సృష్టించి పంపించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకు మించి డబ్బులు వసూలు చేసిన అనంతరం, మరలా అదనపు మొత్తాన్ని తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం తరపున కట్ అయిన మొత్తం వివరాల రసీదు ఇవ్వాలని కోరగా, ఫోటోషాప్ ద్వారా ఎడిట్ చేసినట్లు కనిపించే నకిలీ రసీదును పంపించి ప్రజలను మోసం చేసినట్లు ఆరోపించారు.ప్రభుత్వ సేవలు అందించే మీసేవ కేంద్రాలు ప్రజలకు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సేవలు అందించాల్సిన బాధ్యత ఉందని, ఇటువంటి ఘటనలు ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని సోతుకు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నిందితుడిపై ఫోర్జరీ, మోసం, అవినీతి ఆరోపణల కింద కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాల పనితీరును కూడా పరిశీలించాలని డిమాండ్ చేశారు..

## ప్రాణం పోసుకుంటున్న రియల్ ఎస్టేట్‌ను పాతాళానికి తొక్కుతున్న రేవంత్ రెడ్డి

**పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పై నిషేధం**

**రియాల్టర్లకు ఆత్మహత్యలే శరణ్యం**

**జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** ప్రాణం పోసుకుంటున్న రియల్ ఎస్టేట్ ను పాతాళానికి తొక్కుతున్న రేవంత్ రెడ్డి అని, మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు క్రమేణా పుంజుకుంటున్న రియల్ ఎస్టేట్ ప్రభుత్వ నిర్ణయంతో రియల్ ఎస్టేట్ యజమానులు, మధ్యవర్తులు రోడ్డుపై పడాల్సివస్తుందని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ విమర్శించారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతములో పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ఎల్.ఆర్.ఎస్ ఫీజు కట్టుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు కొద్దిగా ఉపశమనం కలిగి రియల్టర్స్, మధ్యవర్తులు ఊపిరి పీల్చుకొని కాస్తో కూస్తో వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు అని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అకస్మాత్తుగా 06.07.2026 న జి.ఓ నం.5509/2025ను తెరమీదికి తెస్తూ పాత వెంచర్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించడం దారుణమని ధ్వజమెత్తారు. స్వతహాగా ముఖ్యమంత్రి నేను రియల్ ఎస్టేట్ వ్యాపారి అని రియల్ ఎస్టేట్ రికార్డ్ స్థాయిలో అభివృద్ధిలోకి తీసుకొస్తానని ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల వ్యాపారం దారుణంగా నష్టపోయి అప్పులు చెల్లించలేక రియాల్టర్స్ ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది మధ్యవర్తులు, ఏజెంట్లు ఉపాధిలేక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకనాడు ఏకరం కోటి రూపాయలు పలికిన ధరలు దారుణంగా పడిపోయి లక్షలకు కూడా ఎవ్వరూ కొనడం లేదని ఈ ప్రభావం అన్ని వ్యాపారాలపై పడి ప్రజల జీవన ప్రమాణాలు ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై అల్లాడుతున్నారని మార్కెట్లో ఒక్క రూపాయి కూడా అప్పు పుట్టక ఉన్న భూములు అమ్ముడుపోక తమ పిల్లలకు వివాహాలు, ఇంటి నిర్మాణాలు,పై చదువులు వాయిదా వేసుకొని తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జి.ఓ ఉపసంహరించుకుని రియల్ ఎస్టేట్ పుంజుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని నందిమల్ల.అశోక్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ నాయకులు గంధం పరంజ్యోతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్య సాగర్ పుణ్యక్షేత్రంలో శివునికి రుద్రాభిషేకం చేసిన కడ్తాల్ మాజీ జెడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ మరియు స్థానిక సర్పంచ్ శీను నాయక్ దంపతులు



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** ఆమనగల్ మండల కేంద్రంలోని రామ్ నుంతల గ్రామపంచాయతీలో అయ్యా సాగర పుణ్యక్షేత్రంలో శివాలయం లో ఈరోజు కడ్తాల్ మాజీ జెడ్పీటిసి ఓ రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఓ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్. రామ్ నుంతల సర్పంచ్ శీను నాయక్ దంపతులు శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి రుద్రాభిషేకం చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివపార్వతుల రుద్రాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది రుద్రాభిషేక మహోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొని, అత్యంత భక్తిశ్రద్ధలతో మహోత్సవాన్ని నిర్వహించడం జరిగిందని భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేయడం జరిగిందని,అయ్యా సాగర్ క్షేత్రంలో శివాలయం లో జరిగే ప్రత్యేక పూజలకు ముఖ్య అతిథులుగా ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఆలయం భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతుందని, శివపార్వతుల రుద్రాభిషేకంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి స్వామివారి అనుగ్రహం ఉంటుందని ప్రతి ఒక్కరూ దైవ భక్తి సేవగుణం కలిగి ఉండాలని వారు అన్నారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యం

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**





**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.. భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి అధునాతన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, 100 పడకల ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండలంలో 26 మంది లబ్ధిదారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతు భరోసా, రైతు బీమా, రైతు బోనస్, మహాలక్ష్మి పథకం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాల ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తోందని పేర్కొన్నారు.విద్య, వైద్యంకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు..ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి మండల తహసీల్దార్, పీఏసీఎస్ చైర్మన్, చిట్యాల మార్కెట్ వైస్ చైర్మన్, స్థానిక సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు..

# 16 ఏళ్లుగా అసంపూర్తిగానే... బేతోలు పీహెచ్సీ భవనానికి మోక్షం ఎప్పుడూ?

**16 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న పీహెచ్సీ భవనం**

**అద్దె, శిథిల భవనంలోనే ఆరోగ్య సేవలు**

**గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా లేని స్పందన**

**వెంటనే భవనం పూర్తి చేయాలని గ్రామస్తుల డిమాండ్**



**బేతోలు, అక్షిత బ్యూరో:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సుమారు 16 సంవత్సరాల క్రితం మంజూరైన బేతోలు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం (పీహెచ్సీ) భవనం నేటికీ పూర్తి కాకపోవడం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో ప్రారంభమైన భవనం స్లాబ్ దశలోనే నిలిచిపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది.

అప్పటి మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే మాలోత్ కవిత శంకుస్థాపన చేసిన ఈ భవనాన్ని గుత్తేదారు స్లాబ్ వరకు నిర్మించి పనులను నిలిపివేశారు. అనంతరం ప్రభుత్వాలు మారినా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో భవనం చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిచెట్లు పెరిగి పూర్తిగా నిరుపయోగంగా మారింది.



ఇదిలా ఉండగా, బేతోలు గ్రామ ఆరోగ్య ఉపకేంద్రం ప్రస్తుతం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఆ భవనం కూడా శిథిలావస్థలో ఉండటంతో వైద్య సిబ్బంది, రోగులు ప్రాణభయంతో సేవలు పొందాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ సమస్యపై గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేయడంతో పాటు 2025 జనవరి 27న జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

"ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?" అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న పీహెచ్సీ భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**వాయిస్**

ప్రజల ఆరోగ్య అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారడం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పీహెచ్సీ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి. అలాగే ప్రహరీ గోడతో పాటు అన్ని కనీస సౌకర్యాలు కల్పించి వెంటనే ప్రారంభించి బేతోలు ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి" అని షేక్ ఖాదర్ బాబా ప్రభుత్వాన్ని కోరారు.



**– షేక్ ఖాదర్ బాబా, బెతోలు**

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం తో పాటు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** జులై 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తకోట పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జూలై 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొత్తకోట పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డితో కలిసి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం తో పాటు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమం జరిగే ప్రాంగణంలో బారికేడ్లు, వేదిక, సౌండ్ సిస్టమ్, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లను ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి విద్యార్థులతో నిర్వహించే ముఖాముఖి సంభాషణ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని సాంకేతిక ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే 9వ, 10వ తరగతి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూర్చునే ఏర్పాట్లు, కార్పెట్లు, తరగతి గదుల్లో ఫర్నిచర్, తాగునీరు, అల్పాహారం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల రాకపోకలు, వారి నిర్వహణకు ప్రత్యేక బృందాలను నియమించి, కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం సమయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి పోలీసు బందోబస్తుపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, వీఐపీ రూట్, ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అనంతరం సీఎం హెలికాప్టర్ ల్యాండ్ అయ్యే హెలిపాడ్ ప్రదేశాన్ని సందర్శించి అక్కడ భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. బారికేడ్ల విషయంపై ఆర్ అండ్ బి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పీ సీఈవో యాదయ్య, ఆర్ అండ్ బి అధికారి దేశ్యా నాయక్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## కానాయపల్లిలో నులిపురుగులు మందుల పంపిణి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో జాతీయ నులిపురుగులు దినోత్సవం సందర్భంగా గ్రామంలో గ్రామపంచాయతీ దగ్గర గ్రామ వైద్య సహాయకురాలు ఎస్తేరమ్మ బాల బాలికలకు నులిపురుగుల మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. చిన్నపిల్లలు తప్పనిసరిగా ఈ మాత్రలు తీసుకోని తమ పిల్లలకు వెయ్యాలని కోరారు. దీని వల్ల పిల్లలకు కడుపులో ఉండే పురుగులు చనిపోతాయాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త సాయిలు, ఆశ వర్కర్ భాగ్య, మాజీ వార్డు సభ్యులు పెద్ద కుర్మయ్య, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**భూపాలపల్లి ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి**



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను వినియోగించుకుని జీవితంలో ముందుకు ఎదగాలని భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అన్నారు..

సోమవారం భూపాలపల్లి ఏరియాలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన సోలార్ టెక్నీషియన్ శిక్షణా కార్యక్రమాన్ని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, దేశంలో పునరుత్పాదక ఇంధన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని,అందులో సోలార్ ఎనర్జీకి విశేష ప్రాధాన్యం ఏర్పడిందని తెలిపారు.భవిష్యత్తులో సోలార్ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ, నిర్వహణ సేవలు,ఇన్‌స్టాలేషన్ రంగాల్లో నైపుణ్యం కలిగిన టెక్నీషియన్లకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.శిక్షణ పొందుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

సోలార్ ప్యానెల్‌ల అమరిక,నిర్వహణ,లోపాల గుర్తింపు, మరమ్మతులు,ఇన్‌వర్టర్ వ్యవస్థలు, విద్యుత్ భద్రతా ప్రమాణాలు, సాంకేతిక అంశాలపై ఈ శిక్షణలో సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా యువతను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్ది, ఉపాధి అవకాశాలను విస్తరించడమే సింగరేణి సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జిఎం కృష్ణ ప్రసాద్, వి.టి.సి. మేనేజర్ నజీర్,అసిస్టెంట్ మేనేజర్ మహేశ్, ట్రైనర్ జయంత్ తదితరులు పాల్గొన్నారు..

# గ్రేవ్‌యార్డ్‌ల అభివృద్ధికి రూ.1.80 కోట్ల నిధులు

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఘన సన్మానం**



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, జూలై 13 (ప్రతినిధి):** ఉమ్మడి చిలుకనగర్, ప్రస్తుత బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో గౌడ, ముదిరాజ్, కుమ్మరి సంఘాలకు చెందిన గ్రేవ్‌యార్డ్‌ల అభివృద్ధి కోసం రూ.1.80 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో విశేష కృషి చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆయా సంఘాల నాయకులు సోమవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా చిల్కానగర్ మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌ను కూడా శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గ్రేవ్‌యార్డ్‌ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయని తెలిపారు. మొత్తం రూ.1.80 కోట్ల నిధులు మంజూరుకాగా, మొదటి విడతగా రూ.45 లక్షలు విడుదల కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ నిధులతో గ్రేవ్‌యార్డ్‌లలో ప్రహరీ గోడలు, అంతర్గత సీసీ రహదారులు, విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయం, షెడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే గౌడ, ముదిరాజ్, కుమ్మరి సంఘాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని సంఘ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. తమ విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించి భారీ నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సహకరిస్తున్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సేవలను కూడా కొనియాడుతూ ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రేవ్‌యార్డ్‌ల అభివృద్ధికి మంజూరైన నిధులను పారదర్శకంగా వినియోగించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ, ముదిరాజ్, కుమ్మరి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్తకోటలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుపై ఎమ్మెల్యేకు వినతి

**ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా అని ఎమ్మెల్యే హామీ**

**అనువైన స్థలాన్ని చూడాలని అధికారులకు ఆదేశాలు**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చెయాలనీ పట్టణ యువకులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొత్తకోటలో క్రీడాకారులు చాలా మంది ఉన్నారని క్రికెట్ ఆడుకోవడనికి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ప్రైవేట్ స్థలంలో క్రికెట్ ఆడుతున్నామని చెప్పారు. శాశ్వతంగా యువకులు ఆడుకునేందుకు క్రికెట్ ప్రాంగణం ఏర్పాటు చెయాలనీ ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిస్కారం చూపాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందించి తప్పనిసరిగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి క్రికెట్ ప్రాంగణం కొరకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదేవిదంగా కొత్తకోట కూత వేటు దూరంలో క్రికెట్ ప్రాంగణం కొరకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి పార్టీలకతీతంగా యువకులు పెద్దలు తరలిరావాలని పిలుపునిచ్చారు. మీ అందరి సహకారం ఉండాలని కొత్తకోట మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకునేందుకు మీ అహకారం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువకులు శ్రీకాంత్, శివశంకర్ గౌడ్, రాఘవేంద్ర గౌడ్, శ్రీనివాసులు, సందీప్, మహేష్, గణేష్, శ్రావణ్, నర్సింహా, అరుణ్, హరికృష్ణ, నాగరాజు, కేశవులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఒక యుద్ధం లాంటింది, అందరూ సైనికుల్లా పని చేయాలి

**తెలంగాణ సాంస్కృతిక కార్పొరేషన్ చైర్మన్ వెన్నెల గద్దర్**

**సర్ ప్రక్రియ వేగవంతం కోసం బిఎల్ఏలకు, నాయకులకు దిశా నిర్దేశం చేసిన జగ్గారెడ్డి, నిర్మల**



**సంగారెడ్డి అక్షిత బ్యూరో :** ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఒక యుద్ధం లాంటిదని, దీన్ని ఎదుర్కునేందుకు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుని లాగా పోరాడాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ కార్పొరేషన్ చైర్ పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ , ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమగ్ర సవరణ పై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బిఎల్వో లు మీ దగ్గరకు రాకున్నా మీరే వెళ్లాలని బిఎల్ఏ లు, నాయకులకు సూచించారు. ఓట్ నమోదు కాకపోతే వ్యక్తిగతంగా ఓటర్ కే నష్టం కాబట్టి ఓటర్ లు కూడా తమ ఓటహక్కును నమోదు చేసుకోవాలనే ఆతృత, ఆసక్తి ఉండాలన్నారు. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రానున్న ఐదురోజుల్లోనే సర్ ప్రక్రియ పూర్తి అయ్యేలా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ పని మనది, మన సంగారెడ్డి కోసం పని చేస్తున్నామనే విషయాన్ని దృష్టి లో పెట్టుకుని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్ పర్సన్ లు కూన వనితా సంతోష్, అంజమ్మ సత్యనారాయణ, నాయకులు కూన సంతోష్, షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్, రఘు గౌడ్, జార్జ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు